క్లుప్తంగా

పేదలకు పండ్లు, మజ్జిగ పంపిణీ

కడప కల్చరల్: కడప నగరానికి చెందిన మౌలాన ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ తన కుమారుడు షౌకత్‌అలీతో కలిసి శనివారం నగరంలోని పలువురు పేదలకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. నగరంలోని పలు కూడళ్లలోని పేదలతోపాటు పాత రిమ్స్‌లోగల ఆదరణ నిరాశ్రయుల వసతిగృహంలోని నిరుపేద వృద్ధులకు వీటిని అందజేశారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్ : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు జిల్లా అంతటా యథాతథంగా పనిచేస్తాయని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు.

'ఆ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి'

వైవీయూ: ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీల నుంచి 2015 నవంబర్‌లో చేరిన ఉపాధ్యాయులను లాంగ్‌స్టాండింగ్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ కోరారు. ఏడున్నర సంవత్సరాలకే వీరిని బదిలీ చేయడం సరికాదన్నారు. ఒకే విద్యాసంవత్సరంలో బదిలీలకు విరుద్ధమైన నిబంధనలతో 187, 47 అనే వేర్వేరు ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నవయుగ వైతాళికుడు సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు స్త్రీ విద్యను ప్రోత్సహించి వితంతు, పునర్వివాహాల కోసం ఆనాడు పోరాటాలను చేశారని పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేంద్ర ప్రసాద్, షాకీర్, ఓబులేసు పాల్గొన్నారు.

నేడు డీఈఓ కార్యాలయం వద్ద నిరసన

ప్రొద్దుటూరు కల్చరల్ : త్వరలో జరగబోయే అన్ని క్యాడర్ల పదోన్నతులను మ్యాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ విధానంలో నిర్వహించాలని కోరుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. బదిలీల నిబంధనల్లో ఉన్న అసంబద్ధాలను తొలగించాలని, ఖాళీలను బ్లాక్ చేయకుండా జిల్లాలోని అన్ని రకాల టీచర్ల ఖాళీలను బదిలీలకు చూపించాలని ఆయన కోరారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.20 వేలు అపహరణ

కడప అర్బన్ : కడప నగరంలోని ఏడు రోడ్ల కూడలి సమీపంలో ఓ వ్యక్తి ఏటీఎం కార్డును మార్చి రూ. 20 వేలు అపహరించాడు. ఈ మేరకు బాధితుడు కె.ఎస్. యూనస్‌బాషా శనివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కలెక్టరేట్‌లోని బి- బ్లాక్‌లో బాలల సంరక్షణ జిల్లా విభాగంలో ఉద్యోగిగా పని చేస్తున్న యూనస్‌బాషా ఈ నెల 4న డబ్బులను డ్రా చేయాలని ఏడు రోడ్ల కూడలిలోని ఎస్‌బీఐ ఏటీఎం మిషన్ వద్దకు వెళ్లాడు. అతనిని ఓ గుర్తు తెలియని వ్యక్తి ఏమార్చి కార్డు తస్కరించాడు. తరువాత రూ.20 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చినట్లు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ ఎన్.వి నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ గూడు కల్పించాలన్నదే ధ్యేయం

సింహాద్రిపురం : ప్రతి ఒక్కరికీ గూడు కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆర్డీఓ వెంకటేశులు అన్నారు. శనివారం సాయంత్రం సింహాద్రిపురంలోని జగనన్న కాలనీని ఆయన పరిశీలించి ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి బిల్లులు ఎలాంటి జాప్యం లేకుండా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, హౌసింగ్ ఏఈ వాసుదేవారెడ్డి, వీఆర్ఓ రాజకుళ్లాయరెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

జమ్మలమడుగు : సీపీఎస్ విధానం రద్దుచేసి వెంటనే ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్ కుమార్, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డిలు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగుల సంఘం నాయకులు పిలుపు మేరకు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1వ తేదీన జీత భత్యాలను చెల్లించడంతోపాటు 12వ వేతన సవరణం చేసి 11వ పీఆర్సీ అమలు చేసి ఒప్పందం ప్రకారం డీఏ అరియర్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

శరవేగంగా రహదారుల విస్తరణ

- పరిహారం కింద రూ.40కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- రోడ్లు, డ్రైన్లు, డివైడర్ల నిర్మాణానికి మరో రూ.100కోట్లు మంజూరు
- మూడు రోడ్లు విస్తరిస్తే 60 శాతం ట్రాఫిక్ ఇబ్బందులు తీరినట్లే



అంబేడ్కర్ సర్కిల్- వై జంక్షన్ రోడ్డు విస్తరణలో భాగంగా కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం చొరవ, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, అధికారుల కృషితో కడప నగరంలో అనేక ఏళ్ల తర్వాత రహదారుల విస్తరణ పనులు వేగవంతం అయ్యాయి. కడప చరిత్రలో తొలిసారి అత్యంత రద్దీగా ఉండే రహదారులు విస్తరణకు నోచుకుంటున్నాయి. విస్తరణ వల్ల నష్టపోయే బాధితులకు నష్ట పరిహారం కింద ప్రభుత్వం రూ.40కోట్లు విడుదల చేయగా, అందులో రూ.33కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యింది. విస్తరణ చేసే మూడు రోడ్లలో కొత్తగా కాలువలు, రోడ్లు, డివైడర్ల నిర్మాణానికి మరో రూ.100కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. రెండు నెలల్లోనే విస్తరణ పనులు పూర్తి చేసి, అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. విస్తరణ పనులకు మార్గం సుగమం కావడంపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

■ అంబేడ్కర్ సర్కిల్- వై జంక్షన్, గోకుల్ సర్కిల్- అన్నమయ్య విగ్రహం, కృష్ణా సర్కిల్- దేవునికడప వరకూ ఉన్న రహదారులను విస్తరించాలని సంకల్పించిన విషయం తెలిసిందే. అంబేడ్కర్-వై జంక్షన్ రోడ్డులో మొత్తం 47 స్ట్రక్చర్లు ఉండగా, 9 మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మిగిలిన 38 మందికి వారు కోల్పోయే స్థలానికి టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. స్ట్రక్చర్లకు పరిహారం కూడా చెల్లించారు. పరిహారం చెల్లించడమే ఆలస్యం కట్టడాలు కూల్చే ప్రక్రియను టౌన్‌ప్లానింగ్ అధికారులు శరవేగంతో పూర్తి చేస్తున్నారు. 80 అడుగుల మేర ఈ రోడ్డును విస్తరిస్తున్నారు.

■ క్రిష్ణా సర్కిల్- దేవునికడప రోడ్డులో మొత్తం 86 స్ట్రక్చర్లు ఉండగా, 41 మందికి నష్ట పరిహారం చెల్లించారు. ఐదుగురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మిగిలిన వారికి నష్ట పరిహారం చెల్లించేందుకు కసరత్తు సాగుతోంది. ఈ మార్గాన్ని కూడా 80 అడుగుల మేర విస్తరించేందుకు కట్టడాల కూల్చివేత వేగంగా సాగుతోంది.

■ గోకుల్ సర్కిల్- అన్నమయ్య సర్కిల్ రహదారిలో మొత్తం 64 స్ట్రక్చర్లు విస్తరణలో నష్టపోతుండగా, 24 మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 19 మందికి వారు కోల్పోయే స్థలానికి టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. 19 మందికి నష్ట పరిహారం ఇచ్చారు. మిగిలిన వారికి కూడా పరిహారం ఇచ్చేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి.

కడప చరిత్రలో ఇది గొప్ప మైలురాయి

కడప నగర చరిత్రలో అత్యంత రద్దీగా ఉన్న మూడు రహదారులు విస్తరణకు నోచుకోవడం ఒక గొప్ప మైలురాయిగా చెప్పవచ్చు. చాలా ఏళ్ల తర్వాత ప్రజా ప్రతినిధులు, కమిషనర్ సహకారంతో అందరినీ ఒప్పించి ఈ పనులు చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఓ వైపు రాజీవ్ మార్గ్ పనులు కూడా పూర్తి కావొచ్చాయి. అంబేడ్కర్- వై జంక్షన్ రోడ్డు, దేవునికడపలో రోడ్డులో కట్టడాల కూల్చివేత మొదలు పెట్టాం. గోకుల్ సర్కిల్- అన్నమయ్య సర్కిల్ మార్గంలో ఈనెల 29 నుంచి మొదలుపెడతాం.

- నాగేంద్ర, అసిస్టెంట్ సిటీప్లానర్, కేఎంసీ

• పైపులైన్‌కు మరమ్మతులు



ట్రంకురోడ్డులో పైపులైన్‌కు మరమ్మతులు చేసిన దృశ్యం

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ట్రంకు రోడ్డులో చిలకలబావి సమీపంలో జీఎం మ్యారేజ్ హాల్ ఎదుట మంచినీటిపైపు లీకేజీని అధికారులు సరి చేశారు. ఇక్కడి పైప్‌లైన్ లీకేజయి తాగునీరు రోడ్డుపై వృథాగా ప్రవహిస్తుండేవి. ఈ విషయంపై ఈనెల 25వ తేది 'సాక్షి' వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన నగరపాలక అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు.

గోశాలకు గోవుల తరలింపు

కడప నగరంలోని మట్టిపెద్దపులి ప్రాంతంలో రోడ్లపై గోవులు సంచరించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడేది. కొన్ని సార్లు ప్రమాదాలు జరిగి గోవులకు కూడా గాయాలయ్యేవి. ఈ విషయాన్ని ఈనెల 21న 'రోడ్లపై గోవుల సంచారం .ట్రాఫిక్‌కు అంతరాయం' శీర్షికన సాక్షి వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన నగరపాలక అధికారులు రోడ్లపై తిరుగుతున్న గోవుల యజమానులకు నోటీసులు జారీ చేసి, వాటిని గోశాలకు తరలించారు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్న బీజేపీ



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు విమర్శించారు. శనివారం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమ్మేళనాల్లో భాగంగా నగరంలోని పాత కలెక్టరేట్ నుంచి ర్యాలీ చేపట్టి మున్సిపల్ ఉర్దూ హైస్కూలు వద్ద కార్మికులతో కలిసి బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్ల పాలనలో కార్మికవర్గం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. దేశ ఆర్థిక సంపదకు మూల కారణమైన కార్మికులపై కక్షసాధింపు ధోరణికి మోదీ కారణమయ్యారని ధ్వజమెత్తారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీలకు ధారాదత్తం చేస్తూ కార్మిక చట్టాలను, హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడాన్ని కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, డిప్యూటీ కార్యదర్శి వెంకట సుబ్బయ్య, రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, నాయకులు కేసీ బాదుల్లా, మద్దిలేటి, సుభాషిణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో ఆర్థిక సంపద ఆవిరి

ప్రధాని మోదీ తొమ్మిది సంవత్సరాల పాలనతో దేశ ఆర్థిక సంపద ఆవిరయిపోయిందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ అలీఖాన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలతో ప్రజలు బతకలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. హిందూ, ముస్లిం అంటూ భారత దేశ సమాజాన్ని విడగొట్టి తద్వారా అధికారం నిలబెట్టుకునేందుకు దేశ పౌరులను బలి చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం తీరు సరికాదు

కడప వైఎస్‌ఆర్‌సర్కిల్ : నూతన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవంలో కేంద్ర ప్రభుత్వ తీరు సరిగా లేదని.. నూతన భవనాన్ని రాష్ట్రపతి చేత ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నేడు దేశ ప్రధాని కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రారంభించడం భారత రాజ్యాంగ ఆర్టికల్ 79 ప్రకారం విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్మోహన్, మనోహర్, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు..

కడప కల్చరల్ : కడప నగరంలో ఆదివారం పలు సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) నూతన కన్వీనర్‌గా పారిశ్రామికవేత్త చిన్నపరెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు. కడప సబ్ డివిజన్ డీఎస్పీ ఎండీ షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఎర్రముక్కపల్లెలోని మానస ఇన్ హోటల్‌లో ఉదయం 10.00 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది.

■ సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నెలనెల సీమ సాహిత్యం పేరిట సాహితీ సదస్సు నిర్వహించనున్నామని కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. నెలనెల సీమ సాహిత్యం 120వ కార్యక్రమంగా నిర్వహించనున్న ఈ సభలో డాక్టర్ టీజీఆర్ ప్రసాద్ జీవితం-సాహిత్యం అనే అంశంపై రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర ఉపన్యాసకులు ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావు ప్రసంగిస్తారని తెలిపారు.

పాదయాత్రకు నాసిరకం వాటర్ బాటిళ్లు

ప్రొద్దుటూరు : త్వరలో ప్రొద్దుటూరులో జరగనున్న నారా లోకేష్ పాదయాత్రలో కార్యకర్తలకు పంపిణీ చేసేందుకు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తన ఇంట్లో నాసిరకం వాటర్‌బాటిళ్లను తయారుచేస్తున్నారని 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కాసులకు కక్కుర్తి పడి తన ఇంటిలోనే సాధారణ నీటిని నింపి వాటర్ బాటిళ్లను తయారు చేస్తున్నాడన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

కల్యాణ మండపానికి వేలం పాట

వేంపల్లె : స్థానిక వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానమైన శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మండపానికి లీజుకు సంబంధించిన వేలం పాట నిర్వహించినట్లు ఈఓ శ్రీధర్, చైర్మన్ కె.వెంకటేష్‌లు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక కల్యాణ మండపం ఆవరణలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. అనంతరం రెండేళ్లపాటు కల్యాణ మండపం లీజుకు రూ.4.35 లక్షలకు వేంపల్లె పట్టణానికి చెందిన టి.రాజేష్‌కుమార్ హెచ్చుపాట పాడి దక్కించుకున్నారు. గతంలో రూ.3.70 లక్షలకు వేలం పాట పాడగా.. ప్రస్తుతం అధికంగా రూ.65 వేలు ఆదాయం చేకూరిందన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి మారుతి ప్రసాద్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులపై దాడి అమానుషం

ప్రొద్దుటూరు కల్చరల్ : హజ్‌యాత్రికులపై దాడి అమానుషమని అంజుమన్ అహలే ఇస్లాం సెక్రటరీ ఖురైషి ఇలియాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్‌లోని జైపూర్ వెళుతున్న హజ్ యాత్రికుల బస్సును ఆపి యాత్రికులపై, బస్సు డ్రైవర్‌పై దాడి చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. దాడికి పాల్పడ్డ విద్రోహకర శక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

వలంటీర్లకు గౌరవ పురస్కారాలు

చెన్నూరు : స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వలంటీర్లకు పురస్కారాలను అందజేసి మాట్లాడారు. మండలంలో 193 మంది గ్రామ వలంటీర్లు ఉండగా, బయనపల్లెకు చెందిన మండే వందనకు సేవావజ్ర పురస్కారం, చెన్నూరు సచివాలయం-1కి చెందిన కరీముల్లాకు సేవారత్న, చెన్నూరు-2 సచివాలయంకు చెందిన బాలరాజురవికుమార్‌కు సేవారత్న, బయనపల్లెకు చెందిన ధనిరెడ్డి నాగలక్ష్మికి సేవరత్న, బలసింగాయపల్లెకు చెందిన రాగి సుమాంజలికి సేవరత్న, రామనపల్లికి చెందిన సుంకర శివకుమారికి సేవరత్న పురస్కారాలు అందజేశారు. 187 మంది వలంటీర్లను సేవామిత్ర పురస్కారాలతో ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఎంపీడీవో గంగనపల్లె సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.వి.ఎస్.ఆర్. రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న పద్మినీకుమార్

వైవీయూ: మహిళలు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కడప వెల్‌నెస్ క్లబ్ ప్రతినిధులు పద్మిని, పద్మినీకుమార్ సూచించారు. శనివారం కేఎస్‌ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 28న మహిళల ఆరోగ్యం, అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తలుగా విచ్చేసిన వారు ప్రపంచవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కళాశాల ఎండీ కె. చంద్ర ఓబుల రెడ్డి, ప్రిన్సిపాల్ డా. వి.ఎస్.ఎస్.మూర్తి, అధ్యాపకులు వి. ఆదినారాయణరెడ్డి, ఆనంద్, షర్మిలభాను తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ సెంటర్లు ప్రారంభం



ట్రిపుల్ ఆర్ సెంటర్ ప్లకార్డులను చూపుతున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 18 సచివాలయాల వద్ద 18 ట్రిపుల్‌ఆర్ సెంటర్లను శనివారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా జీవన విధానం-నా పట్టణం పరిశుభ్రత కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని.. అందులో భాగంగా పట్టణంలోని పాత పంచాయతీ కార్యాలయ సమీపంలోని కాంప్లెక్స్‌లో ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. మన ఇళ్లలో మనకు ఉపయోగపడని వస్తువులు, దుస్తులు వాటిని ట్రిపుల్ ఆర్ సెంటర్‌లో అందిస్తే వాటిని ఉపయోగపడే వారికి అందించడం జరుగుతుందన్నారు. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ సహరీ అనే పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమకు ఉపయోగపడని వస్తువులను, దుస్తులను ట్రిపుల్ ఆర్ సెంటర్లకు అందించాలన్నారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలు పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత అంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌స్పెక్టర్ మురళీ, మెప్మా అధికారులు నాయుడు, నాగన్న, ఆర్పీలు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తప్పవు

పులివెందుల రూరల్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో జూదం, క్రికెట్ బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అర్బన్ సీఐ రాజు, ఎస్ఐ హుస్సేన్‌లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందులలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్, జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు గ్రామ బహిష్కరణ ఉంటుందని హెచ్చరించారు. ఇటీవల పులివెందుల పట్టణంలో వరుస సంఘటనల నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఉంటుందని తెలిపారు.

తేనెటీగల పెంపకంతో ఎక్కువ లాభాలు

పులివెందుల రూరల్ : తేనెటీగల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చునని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఫుడ్‌అండ్‌సైన్స్ కళాశాలలో ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్ అధ్యక్షతన తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ హాజరై మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో తేనెటీగల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చునన్నారు. అనంతరం శిక్షణ నిపుణులు డాక్టర్ శిల్పకళ, అభ్యుదయ రైతు ఎం.ఎస్.రాజులు తేనెటీగల పెంపకంలో సాంకేతికత, మెళకువల గురించి వివరించారు. అనంతరం బాక్సులలో తేనెటీగలను స్వయంగా చూపించి తేనె ఎలా సేకరించాలో క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు ఏడుకొండలు, కళాశాల సిబ్బంది, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

పరిశ్రమలకు సీఎం పెద్దపీట



పరిశ్రమను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పరిశ్రమల కారిడార్‌గా కడపను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం అంజద్ బాషా అన్నారు. నగర శివార్లలోని పుట్లంపల్లె ఏపీఐఐసీ ఎస్టేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాస్మోస్ ఎయిర్ ప్రొడెక్ట్స్ యూనిట్‌ను స్థానిక మేయర్ కె.సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్యాస్ ఉత్పాదిత యూనిట్ యాజమాన్య బృందం కడప నగరానికి చెందిన హఫీజుల్లా, షుబతుల్లాలు అందరికీ సుపరిచితులేనని తెలిపారు. వ్యాపార రంగంలో మరో యూనిట్‌ను విస్తరించడం సంతోషించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పరిశ్రమలకు పెద్దపీట వేశారన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అనేక రకాల పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెండుగా లభించే అవకాశాలు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, 3, 15, 30 డివిజన్ల కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, వీరారెడ్డి, షఫీ, వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శనివారం కడప నగర పరిధి 17వ డివిజన్‌లోని చిన్నముసల్‌రెడ్డిపల్లె, సొమ్మవాండ్లపల్లె, వెంకటగారిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చెప్పిన నవరత్నాల్లోని ప్రతి పథకాన్ని 97 శాతం పూర్తి చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్‌ఆర్‌సీపీ అన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో వాగ్దానాలు ఇచ్చి గాలికి వదిలేశాయన్నారు. వలంటీర్ల సహాయంతో జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలన్నింటిని వారి ఇంటి ముంగిటకే చేరుస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే ప్రతి గ్రామంలో ఇళ్లులేని వారిని గుర్తించి వారికి ఇంటి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణాలను చేపట్టి కొత్త గ్రామాలను జగనన్న కాలనీల రూపంలో నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాసరెడ్డి, మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, 16, 17వ డివిజన్ ఇన్‌చార్జ్‌లు నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, గుత్తిరెడ్డి లక్ష్మీరెడ్డి, మట్టి శ్రీనివాసులురెడ్డి, సర్పంచులు మల్లిఖార్జునయాదవ్, సురేంద్రారెడ్డి, ఉపసర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నారే నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షుడు రాజారెడ్డి, శ్రీరామిరెడ్డి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, జ్యోతి, శ్రీరాములు, చిన్నసిద్దయ్య, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూలమూర్తి హోమం, ఉత్సవబలి నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన గరుడవాహనసేవలో శ్రీనివాసుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలకు నిరసనగా 29న బైక్ ర్యాలీ

మైదుకూరు : చంద్రబాబు 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసినందుకు నిరసనగా సోమవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మైదుకూరులో శనివారం ఆయన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని, బ్యాంకుల్లో రైతుల బంగారును తాకట్టు నుంచి విడిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఆ హామీలను నెరవేర్చకుండా మహిళలను, రైతులను చంద్రబాబు మోసగించారని ఆరోపించారు. పాత మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చని చంద్రబాబు తాజాగా మహానాడులో కొత్త మేనిఫెస్టోను విడదల చేయడం శోచనీయమన్నారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరుతూ, చంద్రబాబు ప్రజలను మోసం చేసినందుకు నిరసనగా ఈ బైక్ ర్యాలీ చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. సోమవారం ఉదయం దువ్వూరు సమీపంలోని కోదండ రామాలయం వద్ద నుంచి సుమారు 400 మందితో బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఖాజీపేటలోని బంగ్లా వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాధర్ రెడ్డి, మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మైదుకూరు, దువ్వూరు, చాపాడు ఎంపీపీలు థామస్, జయచంద్రారెడ్డి, లక్షుమయ్య, మైదుకూరు వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మూలె సుధాకర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, గల్లా నరసింహారెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను పరిశీలించిన స్టేట్ స్పెషల్ ఆఫీసర్

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం, కొత్తపల్లె గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలను శనివారం గ్రామ, వార్డు సచివాలయాల స్టేట్ స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్ సందర్శించారు. సచివాలయాల్లోని రికార్డులను ఆయన పరిశీలించారు. సచివాలయాల పనితీరు, ఆర్థిక నిర్వహణ, పథకాల అమలుపై సిబ్బందితో ఆయన మాట్లాడారు. కొత్తపల్లె పంచాయతీలోని సచివాలయాల పనితీరు బాగుందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ సచివాలయ స్టేషనరీ, విద్యుత్ బిల్లులు ప్రతి నెలా గ్రామ పంచాయతీలే భరిస్తున్నాయని తెలిపారు. సచివాలయాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నిధులు కేటాయించాలని స్పెషల్ ఆఫీసర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని తమ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పెషల్ ఆఫీసర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, గోపవరం ఉపసర్పంచ్ రాఘవేంద్రరెడ్డి, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.